సాక్షి
అనకాపల్లి
ఆదివారం । 11 । మే । 2025



ధ్యానోత్సవాలు ప్రారంభం

స్పిరిచ్యువల్ సొసైటీ, ఉత్తరాంధ్ర ధ్యాన మాస్టర్ల ఆధ్వర్యంలో బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10లో

ఉష్ణోగ్రతలు

శనివారం గరిష్టం/కనిష్టం

అనకాపల్లి : 35.5/25.0

అనకాపల్లి: జిల్లాలో రాగల ఐదు రోజులలో తేలిక పాటి నుంచి ఒక మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శనివారం ఒక ప్రకటనలో అన్నారు.



అప్పన్నకు నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

వీర జవాన్ మృతికి ఉపాధి కూలీల నివాళి



నివాళులర్పిస్తున్న ఉపాధి కూలీలు

నాతవరం: ఆపరేషన్ సిందూర్‌లో జవాన్ మురళీనాయక్ వీర మరణం పొందడం పట్ల ఉపాధి కూలీలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు నాతవరం మండలం డి.యర్రవరం పంచాయతీలో శనివారం ఉదయం రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులర్పించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన వీర జవాన్ తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇ.సత్యవతి, నల్లగొండమ్మ తల్లి ఆలయ నిర్మాణ దాత చింతంరెడ్డి బెన్నయ్యనాయుడు, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి అంకంరెడ్డి రామకృష్ణ, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చిన్నారి ముక్కు కొరికేసిన పిచ్చికుక్క

- చంద్రయ్యపేటలో ఘటన

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం పంచాయతీ శివారు చంద్రయ్యపేటలో పిచ్చికుక్క దాడిలో ఏడేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన కక్కుల గగన సింధు (7) తన ఇంటికి సమీపాన పాఠశాల ఆవరణలో సహచర చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. ఈ క్రమంలో అకస్మాత్తుగా పిచ్చికుక్క వచ్చి గగన సింధు ముఖంపై దాడి చేసింది. ముక్కును కొరికేయడంతో తీవ్ర రక్త స్రావమైంది. వెంటనే 108 వాహనంలో కె.కోటపాడు ప్రాంతీయ ఆస్పత్రికి తల్లిదండ్రులు తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్ నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, సదరు చిన్నారికి ఆపరేషన్ అవసరమవుతుందని వైద్యులు నిర్ధారించినట్టు బాధిత చిన్నారి తల్లిదండ్రులు శ్రీను, గణపతి తెలిపారు. కాగా ఇటీవల కాలంలో మండలంలో పిచ్చికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులతోపాటు పెద్దలపైనా దాడులు చేస్తుండటంతో మండల ప్రజలు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మాత్రం నివారణ చర్యలు చేపట్టక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


విమానాశ్రయంలో కట్టుదిట్టమైన భద్రత



వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది

గోపాలపట్నం: దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా విశాఖ విమానాశ్రయంలో భద్రతను పటిష్టం చేశారు. శనివారం విమానాశ్రయ ప్రాంగణంలోకి వచ్చిన ప్రతి వాహనాన్ని సీఐఎస్ఎఫ్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తుల కదలికలను పసిగట్టేందుకు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచి పహారా కాశారు. టెర్మినల్ భవనంలో కూడా విమాన ప్రయాణికులకు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ప్రయాణికుల బ్యాగులతో పాటు దుస్తులను స్కానింగ్ చేశారు. కఠినమైన తనిఖీల నేపథ్యంలో ప్రయాణికులు కనీసం మూడు గంటల ముందుగానే విమానాశ్రయానికి చేరుకున్నారు. హై అలర్ట్ కారణంగా విమానాశ్రయం లోపలికి సందర్శకులకు అనుమతి ఇవ్వడం లేదు. సందర్శకుల టిక్కెట్ల అమ్మకాలను కూడా నిలిపివేశారు.

14వ పోప్‌గా లియో నియామకంపై హర్షం



మాట్లాడుతున్న విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల

దాబాగార్డెన్స్ (విశాఖ): రోమన్ క్యాథలిక్ మిషన్‌కు 267వ జగద్గురువుగా, పరిశుద్ధ 14వ పోప్‌గా లియో నియామకంపై విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల హర్షం వ్యక్తం చేశారు. సెయింట్ ఆంథోనీ చర్చి ప్రాంగణం, ఆర్చి బిషప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఉడుముల బాల మాట్లాడారు. పోప్ ఫ్రాన్సిస్ ఇటీవల దైవ సన్నిధికి చేరిన నేపథ్యంలో వాటికన్ అధిపతిగా, పునీత పేతురు వారసుడిగా లియో నియమితులయ్యారన్నారు. నూతనంగా ఎన్నికైన పోప్‌కు విశాఖ అగ్రపీఠం తరఫున శుభాకాంక్షలు తెలిపారు. లియో 2015లో పీఠాధిపతిగా, 2023లో కార్డినల్‌గా వ్యవహరించారన్నారు. నూతన పోప్ భారత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తారని, ఆయన పాలనలో భారత్‌ను దర్శిస్తారని ఆశిస్తున్నట్టు చెప్పారు.

SUNDAY SPECIAL

నోరూరగాయ..



'ముద్దపప్పు మిత్రమై వర్ధిల్లే ఆవకాయ వేసవిలో పుట్టి చవులూరించే ఆవకాయ'

వేసవి వచ్చిందంటే చాలు వంటగదిలో హడావుడి మొదలయ్యేది.. ఆ ఏడాది ఆవకాయ పెట్టే కార్యక్రమం గురించి చర్చోపచర్చలు జరిగేవి.. మంచి మామిడి కాయలు తెచ్చుకోవాలి.. కరెక్ట్ సైజులో ముక్కలు కొట్టించాలి.. సరైన మోతాదులో సంబారాలన్నీ కలుపుకోవాలి.. శుచిగా శుభ్రంగా చేసుకోవాలి, ఎందుకంటే ఏడాదంతా నిల్వ ఉండాలి కదా.. ఆవకాయ పెట్టే విధానం గురించి కొత్త కోడలికి పాఠాలు.. సరిగ్గా నేర్చుకోవడం లేదని కూతురికి అక్షింతలు.. ఇంటి పెద్ద హడావుడే హడావుడి..

ఇదంతా గతం. ఇప్పుడు ఆవకాయ పెట్టే ఓపిక, తీరిక ఎవరికుంది? ఆవకాయ పెట్టడం ఎందరికి వచ్చు? పెరిగిన ధరలతో అది భారంగా మారిన వేళ అంత శ్రమ ఎవరు తీసుకుంటారు?

- ఆంధ్రులకు ఆవకాయతో అనుబంధం
- వేసవి కాలంలో ఇంటింటా సందడే సందడి
- కానీ అదంతా ఒకప్పటి మాట
- మారిన అభిరుచులతో తగ్గిన ఆదరణ
- పెరిగిన ధరలతో తయారీ భారమే..









మామిడి కాయలు ముక్కలుగా కోసి.. కారం, ఆవాలు దట్టించి.. ఆవకాయ తయారు చేసి.. పింగాణీ జాడీల్లో ఇలా భద్రపరుస్తారు..

నక్కపల్లి: ఊరగాయ ఒక్కటి చాలు.. ముద్దపప్పులో కలుపుకొని తినొచ్చు.. నెయ్యి వేసుకొని అన్నంలో కలుపుకొని ఆరగించవచ్చు.. పెరుగన్నంతో నంజుకుంటూ.. ఆహా ఏమి రుచి అని రాగాలు తీయవచ్చు. ఎక్కువ వంటలు చేయడానికి అవకాశం లేకపోతే ఆ పూట గడిపేయడానికి ఊరగాయ ఒక్కటి చాలు.. కానీ ఏం లాభం.. ఈ తరం రుచులే మారిపోయాయి. వారు కొత్త కొత్త వంటకాలు కోరుతారు. బీపీ పెరుగుతుందని తినే వారిని కూడా తిననివ్వరు. ఇదీ నేటి పరిస్థితి. అయితే ఆవకాయ పెట్టడం అంత ఆషామాషీకాదు. తగ్గిన మామిడి దిగుబడి, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ఆవకాయ వాసనలు అక్కడక్కడ మాత్రమే ముక్కుపుటాలను సోకుతున్నాయి.

ధరల దరువు

కొన్ని దశాబ్దాలుగా ఆవకాయ పచ్చడితో ఆంధ్రులకు మంచి అనుబంధం ఉంది. ప్రతి ఇంటా కచ్చితంగా తయారు చేసేవారు. కానీ సరకుల ధరలు ఆకాశాన్నంటడంతో రానురాను ఆవకాయ పెట్టేవారు తగ్గిపోతున్నారు. 40 మామిడి కాయలనుపయోగించి ఆవకాయ పెట్టాలంటే సుమారు రూ.5 వేల వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మామిడి కాయల దిగుబడి అంతంతమాత్రంగానే ఉంది. మార్కెట్లో మామిడి కాయలు ఒక్కొక్కటి రూ.20లకు కొనుగోలు చేసి ఆవకాయ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి.

నాణ్యమైన మామిడి కాయలేవీ?

వర్షాభావ పరిస్థితుల కారణంగా దిగుబడి బాగా తగ్గిపోయింది. దీనికితోడు తెగుళ్లు కూడా బాగా సోకడంతో నాణ్యమైన మామిడి కాయలు దొరకడం కష్టంగా ఉంటోందని గృహిణులు, పచ్చడి తయారీదార్లు వాపోతున్నారు. ఆవకాయ కోసం ఎక్కువగా కోలంగోవా, కొత్తపల్లి కొబ్బరి, సువర్ణరేఖ, కలెక్టర్ తదితర రకాల మామిడి కాయలను వినియోగిస్తుంటారు. ఈ ఏడాది కలెక్టర్ మినహా మిగతా రకాల మామిడి కాయల దిగుబడి తగ్గిపోయింది. ఏడాదిపాటు నిల్వ ఉండే ఆవకాయకోసం ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. సరైన సమయంలో లేతపరువుతో ఉన్న కాయలనే ఆవకాయ కోసం వినియోగిస్తుంటారు. కొత్తపల్లి కొబ్బరి కాయ రకంతోనే ఆవకాయ పెట్టడానికే ప్రాధాన్యం ఇస్తారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు, నాణ్యమైన మామిడికాయల కొరత తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని చాలామంది సొంతంగా ఆవకాయ పెట్టుకునే బదులు సీజనల్ వ్యాపారుల వద్ద సూపర్‌మార్కెట్లో లభించే ఆవకాయ డబ్బాలను కొనుగోలు చేసుకునేందుకు సిద్ధపడుతున్నారు. ఇన్ని వ్యయప్రయాసలు పడి నిల్వ ఉండే పచ్చళ్లు పెట్టే బదులు మార్కెట్లో రెడీమేడ్‌గా దొరికే పచ్చళ్లు కొనుగోలు చేయడానికే కొంతమంది మొగ్గు చూపుతున్నారు. అయితే ఇంట్లో తయారు చేసిన ఆవకాయకు మరేదీ సాటి రాదన్న ఉద్దేశంతో ఖర్చుకు వెనుకాడకుండా ఇళ్లలోనే తయారు చేసేవారూ ఉన్నారు.

ఆవకాయ చాలా కాస్ట్లీ గురూ..

40 మామిడి కాయలతో ఆవకాయ పెడితే ఖర్చు ఇలా అవుతోంది..

మామిడి కాయల ధర రూ.800లు, పొట్టు తీసిన ఆవపొడి 2 కిలోలు రూ.560లు, కారం 2 కిలోలు రూ.1450లు, 2 కిలోల దంపిన ఉప్పు రూ.100లు, వెల్లుల్లి కిలో రూ.200లు, గానుగ నూనె 4 కిలోలు రూ.1600లు, కాయలు ముక్కలుగా కోయించడానికి రూ.240లు.. ఇలా 40 కాయల ఆవకాయకు సుమారు రూ.5 వేలు ఖర్చవుతోంది. ఒక కాయకు ఖర్చు రూ.124లు అవుతోంది. ఒక మామిడి కాయను 12 ముక్కలుగా కట్ చేస్తారు. ఈ లెక్కన ఒక ఆవకాయ ముక్క ఖరీదు రూ.10లు పడుతోంది.

ధర పెరిగింది.. వ్యాపారం తగ్గింది

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల కారణంగా పచ్చళ్ల వ్యాపారం పెద్దగా రాణించడం లేదు. గతంలో తక్కువ ఖర్చులతో నిల్వ ఉండే ఊరగాయలు పెట్టేవాళ్లం. పది రోజులపాటు చాలా జాగ్రత్తలు తీసుకుని తయారయిన తర్వాత భద్రపరచాల్సి ఉంటుంది. చుట్టుపక్కల వాళ్లు కొనుగోలు చేసేవారు. ఇప్పుడు పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ఊరగాయల ధరలు పెంచాల్సి వస్తోంది. 200 గ్రాముల ఆవకాయ రూ.150లకు విక్రయిస్తే తప్ప గిట్టుబాటు కావడం లేదు. అంత ధర పెట్టి కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మేము చెప్పిన ధరలకు కొనుగోలు చేసే వారి నుంచి ఆర్డర్లు తీసుకుని మాత్రమే తయారు చేస్తున్నాం. ఊరగాయల వ్యాపారం తగ్గించేశాం. – సుబ్బలక్ష్మి, పచ్చళ్ల వ్యాపారి, పాయకరావుపేట

జాగ్రత్తలు తీసుకుంటేనే ఎక్కువ కాలం నిల్వ



నిల్వ ఉండే ఊరగాయలు సొంతంగా పెట్టుకుంటేనే మంచిది. ఆవకాయ పెట్టినప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఏడాదిపాటు నిల్వ ఉంటాయి. నాణ్యమైన మామిడికాయలు తెచ్చుకోవాలి. నెంబర్ వన్ సరకులు ఉపయోగించాలి. గానుగ నూనె వాడటం మంచిది. మాగాయి, తొక్కుడు పచ్చడి వంటి వాటికి ఉప్పులో ఊరబెట్టి అప్పటికప్పుడు ఉప్పు కారం నూనె వంటివి కలుపుకుని వాడుకోవచ్చు. ఆవకాయ అలా కాదు కదా అన్ని ఒకేసారి కలుపుతాం కాబట్టి జాగ్రత్తలు తీసుకోవాలి. 50 మామిడి కాయలతో ఊరగాయ పెట్టాలంటే రూ.6 వేలకు పైగానే ఖర్చవుతోంది. తప్పని పరిస్థితుల్లో ఖర్చయినా ఇళ్లల్లో వాడకం కోసం పెట్టక తప్పడం లేదు. తయారు చేసిన ఆవకాయను పింగాణీ జాడీల్లో పెడితే పాడవకుండా ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉంది. ప్లాస్టిక్ డబ్బాల్లో ఉంచకూడదు. – విశ్వమోహిని, గృహిణి, ఉద్దండపురం

హైదరాబాద్, కాకినాడలకు కొత్త బస్సులు



కొత్త సర్వీసులను ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- నర్సీపట్నం నుంచి నడపనున్న ఆర్టీసీ
- జెండా ఊపి ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం: కాకినాడ, హైదరాబాద్‌కు వేసిన కొత్త ఆర్టీసీ బస్సులను స్పీకర్ సీహెచ్ అయ్యన్నపాత్రుడు శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయడం శుభపరిణామన్నారు. అనంతరం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌లోని టాయిలెట్లు, క్యాంటీన్‌ను పరిశీలించారు. శుభ్రంగా లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్లు శుభ్రం చేసే సిబ్బందికి నెలకు రూ.6 వేల జీతం ఇస్తున్నారని తెలుసుకొని ఆర్టీసీ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వారికి చట్ట ప్రకారం రూ.12 వేలు ఇవ్వాలని ఆదేశించారు. ఈ విషయమై ఆర్టీసీ చైర్మన్, ఎండీకి లెటర్ పెడతానన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో 58 దుకాణాలు ఉన్నాయని, వీటి ద్వారా ప్రతి నెలా అద్దె రూపేణా రూ.7.90 లక్షల ఆదాయం వస్తుందన్నారు. వచ్చే ఆదాయంతో సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజారవాణాధికారి పద్మావతి, డిపో మేనేజర్ ధీరజ్‌ను ఆదేశించారు.

రీజనల్ చైర్మన్ ఏం చేస్తున్నారు?

రీజినల్ చైర్మన్‌గా దొన్ను దొరకు సీఎం చంద్రబాబు నాయుడు అవకాశం కల్పించారని, ఆయన సక్రమంగా విధులు నిర్వహించాలని స్పీకర్ అన్నారు. రీజినల్ చైర్మన్ కనీసం రెండు నెలలకొకసారైనా డిపోలను సందర్శిస్తే ఇటువంటి సమస్యలు తెలుస్తాయన్నారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన దొర ఇప్పటి వరకు నర్సీపట్నం, అనకాపల్లి డిపోలను సందర్శించిన సందర్భాలు లేవన్నారు. కార్యాలయంలో కూర్చొని పరిపాలన చేయడం కాదని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఆయన వెంట కౌన్సిలర్ సిహెచ్.రాజేష్, పార్టీ నాయకులు ఉన్నారు.

శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్- చర్లపల్లి స్పెషల్

చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్(07421) స్పెషల్ చర్లపల్లిలో ప్రతి మంగళవారం ఉదయం 6.55 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 7.55 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.57 గంటలకు బయల్దేరి అదే రోజు రాత్రి 10.45 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 13, 20, 27, జూన్ 3, 10, 17, 24వ తేదీల్లో నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07422) స్పెషల్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతి బుధవారం తెల్లవారు(మంగళవారం మధ్యరాత్రి) 12.30 గంటలకు బయల్దేరి అదే రోజు తెల్లవారు 3.20 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 3.22 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు చర్లపల్లి వెళ్తుంది. ఈ స్పెషల్ ఈ నెల 14, 21, 28, జూన్ 4, 11, 18, 25వ తేదీల్లో నడుస్తుంది.

చర్లపల్లి-శ్రీకాకుళంరోడ్-చర్లపల్లి స్పెషల్

చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్(07425) స్పెషల్ చర్లపల్లిలో ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 2.32 గంటలకు బయల్దేరి అదే రోజు సాయంత్రం 5.30 గంటలకు శ్రీకాకుళం రోడ్ వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 12, 19, 26, జూన్ 2, 9, 16, 23వ తేదీల్లో నడుస్తుంది. శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి (07422) స్పెషల్ శ్రీకాకుళం రోడ్‌లో ప్రతి సోమవారం రాత్రి 7.30 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 10 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడి నుంచి 10.02 గంటలకు బయల్దేరి మరుసటి రోజు(మంగళవారం) ఉదయం 9.15 గంటలకు చర్లపల్లి వెళ్తుంది. ఈ స్పెషల్ రైలు ఈ నెల 12, 19, 26 జూన్ 2, 9, 16, 23వ తేదీల్లో నడుస్తుంది.

సరుగుడులో లేటరైట్ తవ్వకాలు

- గిరిజనుల జీవనోపాధికి దెబ్బ
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకన్న



నర్సీపట్నం: నాతవరం మండలం సరుగుడు ప్రాంతంలో కూటమి ప్రభుత్వం అడ్డగోలుగా లేటరైట్ తవ్వకాలు చేపడుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ప్రాంతంలోని 30 వేల ఎకరాల్లో లేటరైట్ తవ్వకాల అనుమతుల కోసం 2013లో బినామీలు పేరున దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో కొయ్యూరు మండలం కాకరపాడుకు చెందిన గిరిజనేతరుడు జర్తా లక్ష్మణరావుకు 121 ఎకరాల్లో అప్పట్లో అనుమతులు ఇవ్వగా, తాము తీవ్రంగా వ్యతిరేకించామన్నారు. సదరు లీజుదారు గిరిజనుడు కాదని రుజువు కావడంతో మైనింగ్ తవ్వకాలు నిలిచిపోయాయన్నారు. ఈ నేపథ్యంలో కూటమి అధికారంలోకి వచ్చాక ప్రస్తుతం 296.34 హెక్టార్లల్లో మైనింగ్ వ్యాపారులు తవ్వకాలు చేస్తున్నారన్నారు. వీటి వల్ల పోడు వ్యవసాయం, కొండ కింద పండించే వరి, ఇతర ఆహార పంటలకు నీటి వసతి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ హక్కుల చట్టాన్ని ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. తవ్వకాల ప్రాంతంలో వివిధ రకాల చెట్లు, అడవి ధ్వంసమవుతున్నాయన్నారు. కొన్ని వందల అడుగులు మేర లేటరైట్ తవ్వకాలు చేపట్టి, పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నారని వాపోయారు. సిమెంట్ తయారీకి, ఇతర నిర్మాణ అవసరాలకు ఉపయోగిస్తున్న లేటరైట్‌కు డిమాండ్ ఉండడంతో మైనింగ్ మాఫియా అటవీ హక్కుల చట్టానికి తూట్లు పొడుస్తుందని ధ్వజమెత్తారు. ఈ తవ్వకాల వల్ల అసనగిరి, సిరిపురం, ముంతమామిడి, భమిడికలొద్ది, తొరడ, ఎరకంపేట, సరుగుడు, సుందరకోట, కిండంగి, తదితర గ్రామాల గిరిజనులకు నష్టం జరుగుతుందన్నారు. వీరిని ప్రలోభ పెట్టేందుకు లేటరైట్ లీజుదారుని వెనుక ఉన్న నర్సీపట్నానికి చెందిన మైనింగ్ వ్యాపారి డబ్బులు ఆశ చూపుతున్నారని ఆరోపించారు. గిరిజనులను వర్గాలుగా చీల్చి అక్రమంగా లేటరైట్ తవ్వకాలు చేస్తున్నారని, వెంటనే మైనింగ్ లీజులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.



లేటరైట్ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతం

సింహాచలం దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా సుజాత



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా దేవదాయశాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత నియమితులయ్యారు. ఈ మేరకు ఆమెకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ సెక్రటరీ వి.వినయ్‌చంద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కాగా ఇప్పటివరకు ఇన్‌చార్జి ఈవోగా పనిచేసిన కె.సుబ్బారావును ప్రభుత్వం సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇదిలావుండగా దేవస్థానం పర్మినెంట్ ఈవోగా ఉన్న వి.త్రినాథరావు వ్యక్తిగత కారణాల వల్ల అమెరికా వెళ్లేందుకు ఈ ఏడాది మార్చి 1 నుంచి మే 30 వరకు సెలవు పెట్టారు. దీంతో రెవెన్యూ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చి దేవదాయశాఖ రాజమహేంద్రవరం జోన్-1 ఆర్‌జేసీగా పనిచేస్తున్న కె.సుబ్బారావుకు 92 రోజులపాటు ఇన్‌చార్జి ఈవోగా పూర్తి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. దీంతో ఆయన మార్చి ఒకటో తేదీన ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించగా.. ఈనెలాఖరుకు పదవీ కాలం పూర్తవుతుంది. గత నెల 30న చందనోత్సవం రోజు గోడ కూలి ఏడుగురు మృతి చెందిన ఘటనలో ఆయన సస్పెండ్ అయ్యారు. ఈనెలాఖరుతో దేవస్థానం పర్మినెంట్ ఈవో వి.త్రినాథరావు 92 రోజుల సెలవు కూడా పూర్తవుతుంది. ఆయన తిరిగి ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తారా..లేదా.. అన్న చర్చ దేవస్థానంలో నడుస్తోంది.

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి



ర్యాలీ చేస్తున్న సీపీఐ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు..

- అమరావతి తప్ప మరొకటి కనిపించడం లేదు
- సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శులు

కంచరపాలెం (విశాఖ): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకుంటోందని సీపీఐ రాష్ట్ర సమితి సహాయ కార్యదర్శులు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జె.వి.సత్యనారాయణమూర్తి ఆరోపించారు. రాష్ట్రంలో భారీ మెజార్టీతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంపై రోజురోజుకూ ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందన్నారు. సీపీఐ విశాఖ జిల్లా మహాసభల సందర్భంగా కంచరపాలెం మెట్టు నేతాజీ కూడలి నుంచి పాత ఐటీఐ జంక్షన్ వరకు శనివారం పెద్ద ఎత్తున ప్రజా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడారు. కేంద్రంలో మూడోసారి అధికారంలో వచ్చిన బీజేపీ ప్రభుత్వం 2014లో ఇచ్చిన హామీలనే ఇంకా అమలు చేయలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాల కల్పన, నల్లధనాన్ని వెలికితీసి ప్రజలకు పంచుతామన్న హామీలను నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఎప్పుడని ప్రశ్నించారు. పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఎప్పుడిస్తారన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పేదలు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు అందిస్తే.. సచివాలయ కార్యదర్శుల ద్వారా టీడీపీ నేతలు దరఖాస్తుదారులను బెదిరించారని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను రైతాంగ పోరాటం స్ఫూర్తితో తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వానికి అమరావతి తప్ప మరొకటి కనిపించడం లేదని విమర్శించారు. గన్నవరంలో అంతర్జాతీయ విమానాశ్రయం, విజయవాడలో రైల్వేస్టేషన్ ఉండగా.. అమరావతిలో మరో విమానాశ్రయం అవసరమేముందని ప్రశ్నించారు.


విద్యుత్ దీప కాంతుల్లో మోదకొండమ్మ ఆలయం


మైదానంలో ఏర్పాటుచేసిన జెయింట్ వీల్


ఆకట్టుకుంటున్న విద్యుత్ కటౌట్

చల్లని తల్లి మోదకొండమ్మ

- నేటి నుంచి పాడేరులో ఉత్సవాలు
- పట్టణమంతా విద్యుత్ దీపాలతో అలంకరణ
- ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో భారీగా ఏర్పాట్లు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర భక్తుల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలు ఈనెల 11వతేదీ నుంచి 13వతేదీ వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కమిటీల ప్రతినిధులు శ్రమించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ అధ్యక్షతన అన్నిశాఖల అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

- అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పాడేరు పట్టణమంతా విద్యుత్ దీపాలతో అలంకరించారు. అన్ని రోడ్లను కలుపుకొని ఐదు కిలోమీటర్ల వరకు ఇరువైపులా లైటింగ్ ఏర్పాటుచేశారు. ప్రధాన జంక్షన్లలో దేవతా మూర్తుల విద్యుత్ దీపాల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.
- మోదకొండమ్మతల్లి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. మోదకొండమ్మతల్లి మూలవిరాట్ విగ్రహాన్ని బంగారు ఆభరణాలతో అలంకరించారు. రూ.2లక్షల వ్యయంతో పూల అలంకరణ చేపట్టారు. మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద మండపాన్ని అందంగా తీర్చిదిద్దారు.


పాడేరు మోదకొండమ్మతల్లి


- ఆదివారం ఉదయం 5గంటలకు అమ్మవారి ఆలయంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు,పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఇతర అధికారులు తొలిపూజలు చేస్తారు. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఇత్తడి ఘటాలను ఆలయం నుంచి తోడ్కొని మెయిన్‌రోడ్డు వరకు ఊరేగిస్తారు. ఘటాలను నెత్తిన పెట్టుకుని భక్తిశ్రద్ధలతో సతకంపట్టు వరకు మోయడం ఉత్సవాల ప్రారంభంలో ప్రధాన ఘట్టం. అమ్మవారి పాదాలు, ఇత్తడి ఘటాలను గుడివాడ మహిళలు శనివారం శుద్ధి చేశారు.


బందోబస్తుపై సూచనలిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్

- ఉత్సవాల సందర్భంగా ఏఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు,ఇతర సిబ్బంది మొత్తం వెయ్యి మందితో ఎస్పీ అమిత్ బర్దర్ బందోబస్తు ఏర్పాటుచేశారు. బందోబస్తుకు సంబంధించి పోలీసు అధికారులు, సిబ్బందితో ఏఎస్పీ అడ్మిన్ ధీరజ్ శనివారం సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటుచేశారు.

ఘనంగా ఏర్పాట్లు: జేసీ అభిషేక్ గౌడ

మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసిందని జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జి ఐటీడీఏ పీవో డాక్టర్ అభిషేక్‌గౌడ తెలిపారు. శనివారం సాయంత్రం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. జెయింట్ వీల్, ఇతర వినోద కార్యక్రమాలకు సంబంధించి భద్రతా చర్యలను అధికారులతో సమీక్షించారు. అలాగే మోదకొండమ్మతల్లి ఆలయం, మెయిన్‌రోడ్డులోని సతకంపట్టు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సబ్‌కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర బాబు, డీఎల్పీవో కుమార్ పాల్గొన్నారు.


ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ దీపాలతో ఆలయ సెట్టింగ్

బందోబస్తుపై ఎస్పీ సమీక్ష

ఉత్సవాల మూడు రోజులు పాడేరు పట్టణంలో పోలీసుశాఖ ఏర్పాటు చేసిన భారీ బందోబస్తు, ఇతర తనిఖీలు, సీసీ,డ్రోన్ కెమెరాల నిఘాపై ఎస్పీ అమిత్‌బర్దర్ శనివారం సమీక్షించారు. మోదకొండమ్మతల్లి ఆలయం, శతకంపట్టు ప్రాంతాలను ఆయన సందర్శించారు. భద్రత ఏర్పాట్ల వివరాలను ఏఎస్పీ (అడ్మిన్) ధీరజ్ తదితర అధికారుల నుంచి తెలుసుకున్నారు.

కార్గిల్ యోధుడు కనకరాజు

- యుద్ధంలో వీరోచిత పోరాటం చేసిన మునగపాక వాసి
- పాక్ సైనికులతో జరిగిన పోరులో ఛాతీ కింద దూసుకుపోయిన బుల్లెట్
- ఆర్మీలో సిపాయిగా చేరి.. హావల్దార్‌గా పదవీ విరమణ


కనకరాజు


యుద్ధట్యాంక్‌పై కనకరాజు (ఫైల్)

మునగపాక: మండల కేంద్రం మునగపాకకు చెందిన కనకరాజు తుపాకీ గుండుకు గుండెను ఎదురొడ్డి కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరుసలిపారు. సరిహద్దులో జరిగిన పోరులో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. మునగపాక గ్రామానికి చెందిన బొయిదాపు సాంబమూర్తి–సత్యవతి దంపతుల పెద్ద కుమారుడు కనకరాజ్. ఐటీఐ పూర్తిచేసి, రిజ్మెంటల్ సెంటర్(ఎంఆర్‌సీ)లో 1994లో శిక్షణలో చేరారు. 1995లో గుజరాత్‌లో సిపాయిగా ఉద్యోగం వచ్చింది. రెండేళ్ల పాటు అక్కడే పనిచేసిన ఆయన 1997–99లో ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పెరేడ్‌లో పాల్గొన్నారు.ఈ పెరేడ్‌లో తన బ్యాచ్ (144)మందితో కలిసి ప్రథమబహుమతిని కైవసం చేసుకున్నారు. 1999లో కూడా తన బ్యాచ్‌తో కలిసి ద్వితీయ బహుమతిని అందుకున్నారు. అదే ఏడాదిలో కాశ్మీరులోని కువ్వాడ జిల్లాకు బదిలీపై వెళ్లారు. అదే సమయంలో కనకరాజ్‌కు లాన్స్ నాయక్‌గా పదోన్నతి లభించింది. అదే ఏడాదిలో మే నుంచి జూలై వరకు జరిగిన కార్గిల్ యుద్ధంలో ఆయన పాల్గొన్నారు. 1999 జూలై 31న భారత సరిహద్దులో పాక్ సైనికులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆయన ఛాతీ దిగువ భాగంలో బుల్లెట్ దూసుకుపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన కనకరాజ్‌ను 428 ఫీల్డ్ అంబులెన్స్‌లో ఆపరేషన్ చేశారు.అయినా ఆరోగ్యం కుదటపడక పోవడంతో శ్రీనగర్ ఆస్పత్రిలో మరోసారి శస్త్ర చికిత్స చేశారు.అది కూడా వికటించింది. ఇన్‌ఫెక్షన్ సోకడంతో గుండె కొట్టుకోవడంలో తేడాలు రావడంతో జమ్మూలోని ఉదంపూర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స నిర్వహించి ఢిల్లీలోని ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. జీర్ణాశయంలో రక్తం గడ్డ కట్టడంతో పేగుకు శస్త్ర చికిత్స నిర్వహించారు.దీంతో సిపాయి ఉద్యోగం చేసే పరిస్థితులు లేకపోవడంతో 2001లో కంప్యూటర్ శిక్షణ పొందారు. నాటి నుంచి రికార్డు ఆఫీసర్‌గా సేవలందించి 2011 అక్టోబర్ 21న హావల్దార్‌గా పదవీ విరమణ చేశారు.

నేటికీ అందని సాయం

కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడిన కనకరాజుకు నేటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదు. దేశం కోసం పనిచేసిన ఉద్యోగులకు ప్రభుత్వం 300 గజాల స్థలాన్ని పట్టణ ప్రాంతాల్లో ఇవ్వాలనే జీవో ఉన్నా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు.దీనికి తోడు మాజీ సైనికుని కోటా కింద 5 ఎకరాల స్థలం కేటాయించాల్సి ఉంది. పదవీ విరమణ నాటి నుంచి ఇంతవరకు పలు మార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని కనకరాజ్ వాపోయారు. కాగా ఉమ్మడి విశాఖ జిల్లాలో మాజీ సైనికులకు సాయం అందించేందుకు ఇటీవల జీవో వచ్చింది. అయితే కనకరాజ్ అనకాపల్లి జిల్లా వాసిగా గుర్తింపు ఉండడంతో ఎటువంటి ఫలం దక్కకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాల్లో మాజీ సైనికులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు మాత్రం ఇక్కడ అందకపోవడం విచారకరమన్నారు.

విద్యుత్ షాక్‌తో 23 గొర్రెలు మృతి


మృతిచెందిన గొర్రెలు

చోడవరం: మండలంలోని గంధవరంలో విద్యుత్ షాక్‌తో 23 గొర్రెలు మృతి చెందాయి. వివరాలిలా ఉన్నాయి. గంధవరానికి చెందిన దేవర నారాయణ అనే గొర్రెలు పెంపకందారునికి గ్రామ సమీపంలో కల్లం ఉంది. అక్కడ రేకుల షెడ్‌లో రోజూలాగే శుక్రవారం రాత్రి తన గొర్రెలను ఉంచి, ఇంటికి వెళ్లిపోయాడు. షెడ్ పక్కనే గల విద్యుత్ స్తంభం నుంచి వచ్చిన విద్యుత్ వైరు.. షెడ్డు చుట్టూ వేసిన ఇనుక కంచెకు తగిలింది.ఆ వైరు ద్వారా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై షెడ్డులో ఉన్న గొర్రెలన్నీ మృతి చెందాయి. శనివారం ఉదయం వెళ్లి చూసేసరికి అన్ని గొర్రెలు మృతిచెంది ఉండడంతో నారాయణ భోరున విలపించాడు. సుమారు రూ.4లక్షలు విలువైన గొర్రెలు మృతిచెందడంతో జీవనాధారం కోల్పోయానని నారాయణ కన్నీరుమున్నీరయ్యాడు. గ్రామ సర్పంచ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ పల్లా నర్సింగరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మొల్లి అప్పలనాయుడు, రాష్ట్ర గొర్రెలు, మేకలు పెంపకందారులు సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ బాధితుడిని పరామర్శించారు. మృతిచెందిన గొర్రెలకు స్థానిక పశువైద్యాధికారి పోస్టుమార్టం చేశారు. విద్యుత్‌శాఖ ఏఈ, సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదం వివరాలు తెలుసుకొని, బాధితుడికి న్యాయం చేస్తామని తెలిపారు.

వివాహం కాలేదన్న మనస్తాపంతో ఆత్మహత్య


అర్జు పాంగి మృతదేహం

కశింకోట: వివాహం కాలేదన్న మనస్తాపంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ అల్లు స్వామినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఉగ్గినపాలెం వద్ద గల బాటిల్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో ఒడిశాకు చెందిన అర్జు పాంగి (25) కూలీగా పని చేస్తున్నాడు. అతని అన్నదమ్ములకు వివాహం అయింది. అర్జుకు మాత్రం వివాహం కాకపోవడంతో మనస్తాపం చెంది తాను నివాసం ఉంటున్న గదిలో శుక్రవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శబ్దాలు విని అనుమానించి పక్క గదిలో వారు గ్రామ పెద్దలను తీసుకు వచ్చి తలుపు తెరిచి చూసి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ శ్రీనివాస్ సందర్శించి, మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

శారదానదిలో జారిపడి వ్యక్తి మృతి

అనకాపల్లి: బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కాలు జారి శారదానదిలో పడి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పట్టణ ఎస్‌ఐ డి.ఈశ్వరరావు తెలిపిన వివరాలివి. శారదానగర్‌కు చెందిన రాపేటి దత్తాత్రేయుడు(70) శనివారం అనకాపల్లి వస్తున్న సమయంలో దారిలో బహిర్భూమికి వెళ్లి మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య లీలా వెంకట గణేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


కారు ఢీకొనడంతో నుజ్జయిన ఆటో

అనకాపల్లి టౌన్: మండలంలోని బవులవాడ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నా యి. చోడవరం నుంచి అనకాపల్లి వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటో, అనకాపల్లి నుంచి చోడవరం వైపు వెళుతున్న కారు బవులవాడ సమీపంలో ఎదురెదుగా వస్తూ బలంగా ఢీకొన్నాయి. దీంతో ఆటో పై భాగం దెబ్బతింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చోడవరం మండలం అంబేరపురానికి చెందిన ఏడుగురు మహిళల్లో నలుగురికి స్వల్పగాయాలు కాగా, ఆళ్ల ముత్యాలమ్మ(51) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రులను స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి చికిత్స అందజేశారు.

ఎస్సీలకు అమలు కాని ఉచిత విద్యుత్

మూడు నెలలుగా బిల్లులు వసూలు చేస్తున్న అధికారులు


తన ఇంటికి వచ్చిన కరెంట్ బిల్లును చూపిస్తున్న బోడమ్మ

బుచ్చెయ్యపేట : ఎస్టీ,ఎస్సీల ఉచిత విద్యుత్ పథకానికి కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 200 యూనిట్ల వరకు ఎస్టీ,ఎస్సీల ఇళ్లకు ఉచిత విద్యుత్ అందజేశారు. కూటమి నాయకులు కూడా ఎస్టీ,ఎస్సీలకు ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. కాని పలు గ్రామాల్లో ఎస్సీలకు విద్యుత్‌శాఖ అధికార్లు బిల్లులు పంపుతున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. లోపూడి గ్రామంలో బండి అప్పారావు పేరుపై విద్యుత్ కనెక్షన్ ఉంది (సర్వీస్ నంబర్ 115634ఎల్008000095). ఆ సర్వీస్ నంబర్‌కు ఇటీవల వరకూ ఎటువంటి చార్జీలు పడలేదు. అయితే మార్చి నుంచి విద్యుత్‌శాఖ అధికారులు బిల్లులు పంపుతూ నగదు చెల్లించాలని వత్తిడి చేస్తున్నట్టు అప్పారావు భార్య బండి బోడమ్మ తెలిపింది. మార్చి నెలలో బిల్లు అందించగా ఉచిత విద్యుత్ కదా అంటే, ఈ సారి బిల్లు వచ్చింది డబ్బులు కట్టేయాలని, ఇక బిల్లు రాదన్నారని ఆమె చెప్పింది. దీంతో మార్చిలో రూ.300 కట్టానని, తరవాత ఏప్రిల్,మే నెలల్లో కూడా డబ్బులు కట్టాలని బిల్లులు అందించారని బోడమ్మ వాపోయింది. ఈ నెలలో రూ. 290 కట్టాలని బిల్లు అందించారని తెలిపింది. రెక్కాడితేనే గాని డొక్క నిండని నాలాంటి పేదల నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేయడం తగదని, తనకు బిల్లు రాకుండా న్యాయం చేయాలని ఆమె కోరింది.

సండే క్లాసిఫైడ్స్ సాక్షి

ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పాయకరావుపేట : సూరంపాలెంలో ఈ నెల 1 నుంచి 10వ తేదీ వరకు జరిగిన 3వ ఆంధ్రా ఎన్‌సీసీ బాలికల బెటాలియన్ జూనియర్, సీనియర్ ఉమ్మడి వార్షిక శిక్షణ శిబిరం -1లో నిర్వహించిన వివిధ పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్‌కు చెందిన జూనియర్ వింగ్, శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాలకు చెందిన సీనియర్ క్యాడెట్లు ప్రతిభ కనబరిచారు. ఈ శిబిరానికి ఎనిమిది జూనియర్, ఐదు సీనియర్ వింగ్‌లకు చెందిన మొత్తం 456 మంది క్యాడెట్లు హాజరయ్యారు. పలు పోటీల్లో ప్రతిభ చూపారు. జూనియర్ వింగ్ విభాగంలో సోలో సాంగ్‌లో మొదటి స్థానం, ఖోఖో, చెస్ పోటీల్లో రెండవ స్థానంలో నిలిచి ఒక బంగారు పతకం, పది వెండి పతకాలను, సీనియర్ విభాగంలో బాడ్మింటన్‌లో మొదటి స్థానం, గ్రూప్ సాంగ్, ఖోఖో పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి ఒక బంగారు, 13 వెండి పతకాలను సాధించారు. క్యాంప్ కమాండెంట్ కల్నల్ హెచ్‌ఎస్ మౌనిక, గ్రూప్ కమాండర్ రితిన్ మోహన్ అగర్వాల్, ఎస్ఎం గులాబ్ సింగ్ చేతుల మీదుగా ఈ పతకాలను అందుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్.వి.కె. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్ ప్రకాష్ తదితరులు అభినందించారు.

ధ్యానోత్సవాలు ప్రారంభం


పాల్గొన్న ఉత్తరాంధ్ర ధ్యాన గురువులు

పెందుర్తి: స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్, ఉత్తరాంధ్ర ధ్యాన మాస్టర్ల సంయుక్త ఆధ్వర్యంలో తలపెట్టిన బుద్ధ పౌర్ణమి ధ్యానోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధ్యాన మాస్టర్లు మాట్లాడుతూ నిరంతర ధ్యాన ప్రక్రియ వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. ధ్యానాన్ని నిత్య జీవనంలో భాగం చేసుకోవాలని సూచించారు. మనిషి మంచి నడవడిక కోసం గౌతమ బుద్ధుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. తొలిరోజు సంగీత ధ్యానంతో ప్రారంభమైంది. అనంతరం సీతమ్మధారకు చెందిన కృష్ణవేణి ఆధ్వర్యంలో శాస్త్రీయ సంగీతం, రమణి బృందం ఆధ్వర్యంలో రమణీయ రాగాలు, నోరి గాయిత్రి ఆధ్వర్యంలో వీణా నాద ధ్యానం, మిట్టా మనోహర్ ఆధ్వర్యంలో ఆచార్య సాంగత్యం, కృష్ణవేణి బృందం ఆధ్వర్యంలో నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఉమ్మడి విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం ప్రాంతాల నుంచి ధ్యాన మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు.

పెళ్లిలో ప్రతీకారం !

తాళ్లతో బంధించి ఒకరిని హింసించిన బంధువులు


తాతారావు కాళ్లు, చేతులు కట్టేసిన పెళ్లి కుమార్తె బంధువులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ పంచాయతీ ఆశిపాలెంలో నల్ల తాతారావు అనే వ్యక్తిని కొందరు వ్యక్తులు తాళ్లతో బంధించి హింసించారు. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటనపై బాధితుడి అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని తాతారావును ఆసుపత్రికి తరలించారు. చిప్పాడ పంచాయతీలోని కంచేరుపాలేనికి చెందిన అబ్బాయికి, ఆశిపాలెం యువతితో శుక్రవారం రాత్రి ఆశిపాలెంలో వివాహం జరిగింది. ఈ వివాహానికి అమనాంకు చెందిన నల్ల తాతారావు.. అతని అన్నయ్య అప్పన్న, తల్లి తవుడమ్మతో కలిసి వచ్చారు. వివాహం అనంతరం అప్పన్న, తల్లి అమనాంకు తిరిగి వెళ్లగా.. తాతారావు అక్కడే మంచంపై నిద్రించాడు. దీనిని గమనించిన పెళ్లి కుమార్తె బంధువులు శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో తాతారావు కాళ్లు, చేతులను తాళ్లతో కట్టేసి బంధించారు. శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తాతారావు అన్నయ్య అప్పన్నకు ఈ విషయం తెలియడంతో తన తమ్ముడిని విడిచిపెట్టమని బంధువులను కోరాడు. అయితే వారు నిరాకరించారు. గతంలో తాతారావుకు కంచేరుపాలెం యువతితో వివాహం జరిగింది. వారి మధ్య వివాదాల కారణంగా ప్రస్తుతం తాతారావు అమనాంలో, అతని భార్య కంచేరుపాలెంలో ఉంటోంది. గతంలో తాతారావు తన మామ అనుకుని వేరే వ్యక్తిని తీవ్రంగా కొట్టాడని, అందుకు ప్రతీకారంగానే తాము అతన్ని బంధించామని పెళ్లి కుమార్తె బంధువులు ఆరోపించారు. తాతారావు అన్నయ్య ఫిర్యాదు మేరకు భీమిలి పోలీసులు శనివారం సాయంత్రం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని విడిపించారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం సాయంత్రం వరకు తన తమ్ముడికి పచ్చి మంచినీళ్లు కూడా ఇవ్వకుండా హింసించిన వారిపై చర్యలు తీసుకోవాలని అప్పన్న డిమాండ్ చేశాడు.

క్లుప్తంగా

పాదచారులకు మజ్జిగ పంపిణీ

అనకాపల్లి: వేసవి దృష్టిలో పెట్టుకుని జీవీఎంసీ విలీన గ్రామమైన సిరసపల్లి చింతామణి దత్త క్షేత్రం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని దత్తక్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయల రాజు తెలిపారు. ఈ మేరకు అట్లూరి పద్మావతి, వెంకట సుబ్బరాజు ఆర్థిక సాయంతో శనివారం పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఏటా ఇక్కడ భక్తుల సహకారంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, వచ్చే నెల 20వ తేదీ వరకూ నిర్వహిస్తామని నిర్వాహకుడు పేర్కొన్నారు.

అమరవీరుడికి ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న జర్నలిస్టులు

అనకాపల్లి టౌన్: ఉగ్రవాదులను అంత మొందించడంలో భాగంగా వీర మరణం పొందిన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు అనకాపల్లి జర్నలిస్టులు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జోహార్ మురళీ నాయక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ సత్యనారాయణ, ఆర్వీ గోపాల్, పెంటకోట సత్యనారాయణ, అప్పారావు, స్వామి, రమేష్, లీగల్ సెల్ జర్నలిస్ట్ సాయిరాం పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి


సీఐటీయూ ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరణ

కశింకోట: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తూ నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు కోరారు. దీనికి సంబంధించిన గోడ పత్రికను కశింకోటలో శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ, కార్మికులకు నష్టం కలిగించే విధంగా తెచ్చిన లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, రిటైర్‌మెంట్ సదుపాయాలు కల్పించాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించరాదన్నారు. రైతుల పంటకు గిట్టుబాటు ధర కల్పించే చట్టం చేయాలన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వివిధ సంఘాల ప్రతినిధులు తనూజ, రమాదేవి, నాగమణి, నారాయణమ్మ, సత్యవతి, అమ్మాజీ, లక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 736 దిమ్మలు వచ్చాయి..

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,400	5,050
రెండవ రకం	3,800	4,400
మూడవ రకం	3,520	3,750

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2: జగదీక వీరుడు అతిలోక సుందరి	
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	సింగల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్


రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్లు రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-14 యూనిట్లు, బీ పాజిటివ్-6, ఓ పాజిటివ్-13, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యూ లోకేష్‌ను (9703619706) సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 384 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 289 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.


గవరపాలెంలో విద్యుత్ మీటర్ రీడింగ్ తీస్తున్న విద్యుత్ సిబ్బంది




అధిక ఉష్ణోగ్రతతో నిర్మానుష్యంగా మెయిన్‌రోడ్డు

'విద్యుత్'తో తస్మాత్ జాగ్రత్త

- వేసవిలో పెరుగుతున్న వినియోగం
- కొద్దిపాటి జాగ్రత్తలతో ప్రమాదాల నుంచి విముక్తి
- ఐఎస్ఐ, బీఐఎస్ మార్కు కలిగిన పరికరాలు వాడాలి
- సరఫరాలో హెచ్చు తగ్గులుంటే ఫిర్యాదు చేయాలి

అనకాపల్లి: వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు వరకూ నమోదు అవుతున్నాయి. ప్రజలు గృహాలకే పరిమితమవుతున్నారు. దాంతో ఉక్కపోత నుంచి ఉపశమనానికి ఇంట్లో విద్యుత్ ఉపకరణాలు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. ఇక్కడ వరకు బాగానే ఉన్నా, విద్యుత్ వైర్ల సామర్థ్యంపైనే సందేహాలన్నీ.. గృహాల్లో, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్‌లో ఇన్‌సీల్డ్ వైరింగా.. గోడలపైనే గొట్టాల్లో ఏర్పాటు చేశారా.. సరైన ప్రమాణాలతో తగిన మందం ఉన్న విద్యుత్ వైర్లు వేశారా అనేది అందరూ గుర్తుంచుకోవాలి. ఏదైనా లోపాలుంటే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. జూన్ 6 వరకూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వేసవి కాలంలో చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే షార్ట్ సర్క్యూట్ ప్రమాదాలు తగ్గుతాయని సిబ్బంది చెప్పుతున్నారు.

విద్యుత్ వినియోగదారులు తీసుకోవలసిన జాగ్రత్తలు....

- వేసవిలో ప్రతి ఒక్కరూ గృహాలకు, కార్యాలయాలను తప్పనిసరిగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లతో విద్యుత్ వైర్లను తనిఖీ చేయించుకోవాలి.
- విద్యుత్ వైరింగ్ చేయించేటప్పుడు పూర్తిగా ఐఎస్ఐ, బీఐఎస్ మార్కులు కలిగిన విద్యుత్ పరికరాలను మాత్రమే వినియోగించుకోవాలి.
- గృహాల్లో విద్యుత్ వినియోగం ఆధారంగా విద్యుత్ శాఖ నుంచి లోడ్‌ను తీసుకోవాలి.
- ప్రమాదాలు జరగకుండా ముందుగానే మంచి వైరింగ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- వైరింగ్ ఏర్పాటు చేసుకునేటప్పుడు ఏసీలు, కూలర్లు, వాటర్ హీటర్లు, మైక్రోఓవెన్ ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు వినియోగించుకోవాలి.
- ఎలక్ట్రానిక్ ఉపకరణాన్ని బట్టి దానికి అనుగుణంగా నాణ్యత కలిగిన విద్యుత్ తీగలను వాడాలి.
- గృహాలు, వాణిజ్య సంస్థలు, కార్యాలయాల్లో తప్పనిసరిగా న్యూట్రల్ పరికరాల కోసం సరిపడేంత ఎర్త్ ఎలక్ట్రోడ్ ఏర్పాటు చేసుకోవాలి.
- వేసవిలో రక్షణ పరికరాలు సరిగ్గా పని చేయాలంటే ఎర్తింగ్ సరైన పద్ధతిలో ఉండేందుకు అవసరమైన ప్రదేశంలో నీరు, రాళ్లు, ఉప్పు ఉపయోగించాలి.
- విద్యుత్ ఉపకరణాలకు మూడు పిన్నులు ప్లగ్‌లు, సాకెట్లు మాత్రమే ఉపయోగించాలి.
- విద్యుత్ స్తంభాల నుంచి మీటర్ వరకూ ఉండే సర్వీస్ వైర్లు అతుకుల్లేకుండా చూసుకోవాలి.
- సింగిల్ ఫ్యూజ్ సర్క్యూట్‌లో ఫ్యూజ్, న్యూట్రల్ ఎర్త్ వైర్లు సమాన పరిమాణంలో ఉండేలా సరి చూసుకోవాలి.
- వేసవి కాలంలో ఏసీలు, ఫ్రిజ్‌లు, టీవీలు ఇతర విద్యుత్ ఉపకరణాలు వాడే సమయంలో కచ్చితంగా స్టెబిలైజర్లను ఉపయోగించాలి. విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు వస్తుంటే, వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి. లేని పక్షంలో సమీప ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు గృహాల్లో వస్తువులు షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయే ప్రమాదం ఉంటుంది.
- గృహాల్లో 15 యాంప్స్ విద్యుత్ ఉపయోగించే చోట 30 యాంప్స్ భారం పడే పరికరాలు ఉపయోగిస్తే తీగలు కాలిపోయే ప్రమాదం ఉంటుంది.
- ఒకే స్విచ్ బోర్డుకు ఎక్కువ ప్లగ్‌లు ఉపయోగిస్తే ఒక్కసారిగా లోడ్ పెరిగి స్పార్క్ వచ్చి ప్రమాదాలకు అవకాశాలు ఉన్నాయి.
- **ఎండలో విద్యుత్ తీగలు ఉంచితే భవిష్యత్‌లో** తీగలపై ఉన్న రబ్బరు మెత్తబడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇంటిలో ఒకేసారి విద్యుత్ ఉపకరణాలన్నీ ఆన్‌చేసి ఉంచకోకూడదు.
- కంప్యూటర్ పరికరాలు, టీవీల వద్ద విద్యుత్ తీగలను చిందర వందరగా ఉంచవద్దు.
- ప్రతి రూమ్‌కు ఎంసీబీలు తప్పనిసరిగా వాడాలి. ప్రమాదాలు జరగకుండా ఎంసీబీలు ఎంతగానో ఉపయోగపడతాయి.

అధిక లోడుతో అనర్థమే....

వేసవిలో విద్యుత్ ఉపకరణాల వినియోగం వల్ల ఒక్కొక్కసారి సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతుంటాయి. గృహాలు, కార్యాలయాల్లో వాడుతున్న విద్యుత్ వాడకాన్ని బట్టి లోడ్‌ను నిర్ధారించుకుని ఆ మేరకు విద్యుత్ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలి. విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వినియోగదారునికి అవసరమైన లోడ్‌ను ట్రాన్స్‌ఫార్మర్‌లో అందుబాటులో ఉంచుతారు. ఎవరైనా వినియోగదారులు 1 కేవీ లోడును మాత్రమే అనుమతి పొంది వేసవి తీవ్రత దృష్ట్యా అధికంగా విద్యుత్‌ను వినియోగిస్తే ఆ ప్రభావం సమీప ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి దాని ఫీజులు ఎక్కువసార్లు పోతాయి.


మెయిన్‌రోడ్డులో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చార్జీల పెంపు భారం



ఏప్రిల్, మే, జూన్ మాసంలో విద్యుత్ వినియోగం గృహాల్లో ఎక్కువగా ఉంటుంది. మిగిలిన సమయాల్లో నెలకు విద్యుత్ బిల్ రూ.200 నుంచి రూ.300 వస్తే, వేసవి కాలంలో మూడింతలు అవుతుంది. వేసవి సెలవులు కావడంలో పిల్లలు ఎక్కువగా గృహాల్లో ఉంటారు. ఉదయం, రాత్రి అనే తేడా లేకుండా ఫ్యాన్లు, ఏసీలు, టీవీలు ఉపయోగిస్తాం. ఏప్రిల్ మాసం విద్యుత్ బిల్లు మేలో రూ.850 వచ్చింది. ఇటీవల కాలంలో ప్రభుత్వం విద్యుత్ బిల్లులు పెంచింది. ఈ భారం వినియోగదారులపై పడింది.

– డి.సత్తిబాబు, అనకాపల్లి

విద్యుత్ వాడకంపై జాగ్రత్తలు తీసుకోవాలి

వేసవిలో విద్యుత్ తీగలు వ్యాకోచం చెందే అవకాశం ఎక్కువగా ఉన్నందున షార్ట్ సర్క్యూట్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. గృహాల్లో వినియోగించే విద్యుత్ ఉపకరణాలకు అనుగుణంగా ప్రత్యేకంగా వైరింగ్‌ను చేయించుకోవాలి. అవసరమైన సమయంలో మాత్రమే విద్యుత్‌ను వాడుకోవాలి. గృహాల్లో అన్ని లైట్లు వేసి ఉంచడం వల్ల వేసవి కాలంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. వేసవి కాలంలో విద్యార్థులకు సెలవులు ఇవ్వడంతో కొంతమంది తీర్థయాత్రలకు వెళ్తారు. అటువంటి సమయంలో విద్యుత్ మీటర్ వద్ద ఫ్యూజులు తీసివేయాలి.

– త్రినాథ్, డి-1 సెక్షన్, ఏఈ, అనకాపల్లి

ఆటలతో మానసిక వికాసం


క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

అనకాపల్లి: వేసవిలో ఆటలకు ప్రాధాన్యమివ్వాలని, తద్వారా విద్యార్థులకు మనోవికాసం లభిస్తుందని వ్యాపారులు కాండ్రేగుల శ్రీరామ్, బుద్ద రాజేష్ తెలిపారు. స్థానిక గవరపాలెం గౌరీ వ్యాయామ శాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ఆటలకు, వ్యాయామానికి కనీసం ఒక గంట సమయాన్ని కేటాయించాలన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని విద్యనభ్యసించడమే కాకుండా ఆటలు, వ్యాయామం చేస్తే శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోచ్‌లు బుద్ద జగన్, కాండ్రేగుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మతల్లిని దర్శించుకున్న చెంగల


మాజీ ఎమ్మెల్యే చెంగలకు గూడుపమ్మతల్లి చిత్రపటానికి అందజేస్తున్న నాయకులు

నక్కపల్లి: మండలంలోని రేబాక గ్రామ దేవత గూడుపమ్మ తల్లిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చెంగల వెంకటరావు శనివారం దర్శించుకుని, పూజలు చేశారు. చెంగలను రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, ఎంపీటీసీ సభ్యుడు వెల్లంకి కాసుబాబు, ఉప సర్పంచ్ చెవ్వాకుల శ్రీను, స్థానిక నాయకుడు నారాయణమూర్తి తదితరులు దుశ్శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

సిరులతల్లికి తులసిపూజ

దాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు.

పెంచిన పాల ధర తగ్గించాలి

- వామపక్ష నాయకుల డిమాండ్

అనకాపల్లి: విశాఖ డైయిరీ యాజమాన్యం పెంచిన పాల ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీకి పాలు పోస్తున్న ఆవు పాల ధరను గతంలో తగ్గించిన యాజమాన్యం, వినియోగదారునికి విక్రయించే లీటరు పాలపై రూ. 2 పెంచడం దుర్మార్గమన్నారు. ఏడాది క్రితం లీటరు పాల ధర పెంపును వ్యతిరేకించిన టీడీపీ, జనసేన, బీజేపీ తక్షణమే జోక్యం చేసుకుని తగ్గింపు చర్యలు చేపట్టాలన్నారు. లీటరు పాల సేకరణ ధరకు, వినియోగదారులకు అమ్ముతున్న ధరకు వ్యత్యాసం రూ.20 ఉందన్నారు. నిత్యావసర సరుకుల పెరుగుదలను దృష్టిలో పెట్టుకొని పెంచిన పాల ధర తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో....

విశాఖ డైయిరీ పాల ప్యాకెట్ల ధరలను తక్షణమే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లాభాల్లో నడుస్తున్న విశాఖ డెయిరీ పాల ప్యాకెట్ల ధరలను పెంచి ప్రజలపై భారం మోపడం సరికాదన్నారు. రైతుల నుంచి సేకరించిన పాల ధరను పెంచకుండా డెయిరీ యాజమాన్యం వినియోగదారులకు అమ్ముతున్న ధరల పెంచడంలో ఉద్దేశమేమిటమని ప్రశ్నించారు. డెయిరీలో పనిచేస్తున్న కార్మికులు పాడి రైతులు శ్రమను దోపిడీ చేసి పాలకులకు ముడుపుల రూపంలో కట్టబెట్టి తన సంస్థలో ఉన్నటువంటి అక్రమాలను కాపాడుకుంటున్నారని దుయ్యబట్టారు. విశాఖ డెయిరీలో అక్రమాలపైన శాసనసభ కమిటీ వేసి విచారణ చేసినా నేటికీ నిజాలను బహిర్గతం చేయడంలో కూటమి ప్రభుత్వం ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. తమ అక్రమాలను కాపాడుకోవడం కోసం ఊసరవెల్లి కంటే లక్ష రెట్లు రంగులు మార్చడంలో డెయిరీ యాజమాన్యం గిన్నిస్ బుక్‌లో తమ స్థానాన్ని కలకాలం కాపాడుకుంటుందని ఎద్దేవా చేశారు.

పరవాడ ఎంపీడీవోగా రమేష్‌నాయుడు


బాధ్యతలు స్వీకరిస్తున్న రమేష్‌నాయుడు

పరవాడ: పరవాడ ఎంపీడీవోగా బి.రమేష్‌నాయుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన శ్యామ్ సుందర్ గత కొన్ని నెలల క్రితం విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం వల్ల సస్పెన్షన్‌కు గురయ్యారు. ఆయన స్థానంలో కొయ్యూరు ఎంపీడీవోగా పని చేసిన రమేష్‌నాయుడును నియమించారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సుకు దరఖాస్తులు

మాకవరపాలెం: అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్)అసిస్టెంట్ డైరెక్టర్ రవికుమార్ తెలిపారు. రెండు నెలల పాటు మండల కేంద్రంలో ఉన్న నాక్ శిక్షణ కేంద్రంలో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 44 ఏళ్లలోపు ఉండి, ఇంటర్ ఆపైన చదువుకున్న వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు 7780374625 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మెరైన్ సిబ్బంది పల్లె నిద్ర

అచ్యుతాపురం రూరల్: పూడిమడక తీరంలో మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది పల్లె నిద్ర నిర్వహించారు. శనివారం స్థానిక సచివాలయంలో ఆయన మత్స్యకారులతో మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధం గురించి వారికి వివరించారు. సముద్ర మార్గం ద్వారా బోట్లపై ఎవరైనా అపరిచితులు, అనుమానాస్పద వ్యక్తులు వస్తే మెరైన్ పోలీస్ సిబ్బందికి లేదా 1093 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలన్నారు.

యుద్ధంలో గెలవాలని పూజలు


కశింకోట ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు


సాంబమూర్తి ఆలయంలో బీజేపీ నేతల పూజలు

కశింకోట: ఆపరేషన్ సిందూర్ కార్యక్రమం విజయవంతం కావాలని కోరుతూ తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో సాంబమూర్తి ఆలయంలో శనివారం బీజేపీ నాయకులు పూజలు చేశారు. భారత సైనికులు, సరిహద్దు గ్రామాల ప్రజలు క్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పొన్నగంటి అప్పారావు, జిల్లా కార్యదర్శులు అయినాల శ్రీను, ఎం. సంతోషి, మండలాధ్యక్షుడు అప్పికొండ అప్పారావు, ప్రధాన కార్యదర్శి ఉప్పలపు చిట్టిబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయంలో పాకిస్థాన్‌తో యుద్ధంలో భారత్ విజయం సాధించాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు శనివారం రాత్రి నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సైనికులు, దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, విజయం చేకూరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జిల్లా సైనిక విభాగం కో-కన్వీనర్ ప్రగడ నూకరాజు, పార్టీ నాయకుడు వై.ఎ. రాజు, ద్వారపురెడ్డి నరసింగరావు, దాడి సత్యనారాయణ, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు 271 తులాలు వెండితో కవచం

వచ్చే నెల 3న అమ్మవారి పండగకు ఏర్పాట్లు


వెండి బంగారు ఆభరణాలతో మోదకొండమ్మ

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ నెల రోజుల పండగలో భాగంగా 271 తులాల వెండితో వెండి కవచం, 8 తులాలతో బంగారంతో శతమానాలతో పాటు వేలాది రూపాయలు విలువ గల పట్టు చీరతో అమ్మవారిని అలంకరించారు. దీంతో పెద్ద ఎత్తున్న భక్తులు శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చే నెల 3వ తేదీన జరగనున్న పండగకు ఇప్పటికే ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పండగకు వచ్చే భక్తులకు గ్రామస్తులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఆదరించడంతో పాటు పండగ విజయవంతం చేయడానికి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు కోరారు.

అధిక లోడ్ లారీకి జరిమానా


కశింకోటలో పోలీసులు పట్టుకున్న అధిక లోడ్ లారీ

కశింకోట: స్థానిక జాతీయ రహదారిపై వాణిజ్య పరంగా అధిక రాయి లోడ్‌తో తరలి వెళుతున్న భారీ టిప్పర్ లారీని పట్టుకున్నట్లు సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. జాతీయ రహదారిపై తమ సిబ్బందితో వాహన తనిఖీలో భాగంగా యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు రాయి లోడ్‌తో వెళుతుండగా గుర్తించి పట్టుకున్నామన్నారు. దాన్ని స్వాధీనం చేసుకొని ఆర్టీవోకు అప్పగించగా, రూ.36 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అధిక లోడ్‌తో వాహనాలు ప్రయాణించడం వాహన నియమావళిని ఉల్లంఘించడమేనని, ఇది ప్రమాదాలకు కారణం కావడంతోపాటు రహదారి దెబ్బతినడానికి దోహదపడుతుందన్నారు. దీనిదృష్ట్యా ఇటువంటి వాహనాలకు ఇప్పటికే జరిమానా విధించడం, పలువురు డ్రైవర్లపై కేసు నమోదు చేశామన్నారు. వాహనాల్లో అనుమతించిన బరువుకు మించి లోడును వేసి ఎట్టి పరిస్థితుల్లోను తరలించవద్దన్నారు. లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు, ప్రజలు, ట్రాన్స్‌పోర్టు సంస్థలు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని నిబంధనలకు అనుగుణంగా పరిమితంగా లోడ్ తరలించాలని సూచించారు.

ఎస్సీ సంక్షేమ పథకాలు తక్షణం పునరుద్ధరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు

దేవరాపల్లి: ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి తక్షణం అమలు చేయాలని మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. మండల కేంద్రం దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహం వద్ద శనివారం మండల సంఘ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు మంజూరు చేయడంతో పాటు దళిత కాలనీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులు వెచ్చించాలన్నారు. దేవరాపల్లిలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల సంఘం సభ్యులు సబ్బవరపు దేముడు, తాడి అప్పారావు, తెరపల్లి శ్రీరామ్, తాడి ఎర్నిబాబు, సబ్బవరపు కొండలరావు, మల్లవరపు దేముడు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థికి వితరణ


ఆస్పత్రిలో విద్యార్థిని పరామర్శిస్తున్న కొత్తకోట గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు

రావికమతం: మండలంలో కన్నంపేట గ్రామానికి చెందిన విద్యార్థి సియాద్రి మణికంఠ ఇటీవల అనారోగ్య సమస్యతో విశాఖపట్నం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయమై శనివారం 'సాక్షి'లో వచ్చిన వార్తకు స్పందించిన కొత్తకోటకు చెందిన గ్రౌండ్ బాయ్స్ సేవా సంఘం సభ్యులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ విద్యార్థిని పరామర్శించారు. రూ.15 వేలు ఆర్థిక సహాయం శనివారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు. విద్యార్థికి నగదుతో పాటు అవసరమైన రక్తం సిద్ధం చేశామని సంఘ సభ్యులు శేషు తదితరులు తెలిపారు.